

# మసక

శ్రీమతి న్యాయపతి కమలారాంజీ

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటవ నంబరు ప్లాట్‌ఫాం మీదకి వచ్చి ఆగింది. స్టేషన్‌లో రణగొణధ్వని మొదలైంది. ఎస్-6లో నా బెర్త్ నంబరు చూసుకుని నా ఎయిర్ బ్యాగ్‌ని బెర్త్‌క్రిందపెట్టి నేను బెర్త్ మీద కిటికీకి ఆనుకుని కూర్చున్నాను. నేను ఎప్పుడూ లోయర్ బెర్తే తీసుకుంటాను. లోయర్ బెర్త్ దొరక్కపోతే వెళ్లడం మానేస్తాను. అంతేకాని మిడిల్, అప్పర్ బెర్త్‌లు తీసుకోను. ఎందుకంటే నేను ఎక్కలేను.

చూస్తూండగానే ప్లాట్‌ఫాం మీద జనసందోహం తగ్గింది. ప్లాటుఫారం కనుమరుగైపోయి చెట్లు, చేమలు, కొండలు, ఆకాశం దర్శనమిస్తున్నాయి. రైల్లో కూర్చుంటే నాకు మానవజీవితం గుర్తొస్తుంది. జీవితం ఒక రైలుప్రయాణంలాంటిది. మనకి జీవితంలోని ప్రారంభ దశలో కొంతమంది వ్యక్తులతో పరిచయం అవుతుంది. ఆతర్వాత వాళ్లెవరో మనమెవరో! అలాగే ఒక్కొక్క స్టేజిలో ఒక్కొక్కరు! ఎంతోమంది వ్యక్తులతో మనం పరిచయం పెంచుకుంటాం. కాని కాలంతోపాటు ఆ వ్యక్తులు మనకి దూరమవుతూవుంటారు. ఎప్పుడైనా గుర్తొస్తే తల్చుకుంటాం. లేకపోతే లేదు. కొందరిని తల్చుకుని బాధపడతాం. కొందరిని తల్చుకుని ఆనందిస్తాం. వాళ్లకి మనకి మధ్యనున్న సంబంధబాంధవ్యాల బట్టి మనం వాళ్లని జ్ఞాపకంపెట్టుకునే తీరుమారుతూ వుంటుంది.

రైలు ప్రయాణం కూడా అలాంటిదే. ఎవరి ప్రయాణం వారిదే. ఎవరి గమ్యం వారిదే!...

కొంతసేపు మేగజైన్ తిరగేస్తూ కూర్చున్నాను. అంతలోనే నిద్ర ముంచుకొచ్చింది. కూర్చునే కునికిపాట్లు పడసాగాను. ఎవరివో మాటలు వినిపించి టక్కున కళ్లు తెరిచాను. ఎదురు బెర్త్‌లో ఒక అబ్బాయి తన లగేజ్‌ని బెర్త్ క్రింద సర్దుతున్నాడు. లగేజ్ సర్దడం అయ్యాక రిలాక్సయి కూర్చుని పేపరు చూడ్డం మొదలెట్టాడు. ఆ కుర్రాడికి ఇరవై సంవత్సరాలుంటాయి. ఆ ముఖం ఎక్కడో చూసినట్టుంది. చాలా పరిచితమైన ముఖం.. ఆ ముఖం పోల్చుకోవడానికి ఒక నిముషం కూడా పట్టలేదు. నాకు అత్యంత ఆప్తుడైన, చాలా ఇష్టమైన, నేను అమితంగా ప్రేమించిన ప్రసాదరావు ముఖం అది! అచ్చు గుద్దినట్టు అదే పోలిక! నాజన్మ ధన్యమైనట్టు అనిపించింది. మాటల్లో చెప్పలేనంత సంతోషం కలిగింది.

''బాబూ! నీ పేరేమిటి?'' ఆప్యాయంగా పలకరించాను.

''నాపేరు జగదీష్ అండీ.''

''మీనాన్నగారి పేరు?'' నాలో ఆతృత పెరిగిపోతున్నాది.

''ప్రసాదరావుగారు''

నేను దిగ్భ్రాంతి చెందాను.

ఆకాశంనుండి దేవతలు పుష్పవర్షం కురిపిస్తున్నట్టు, సప్తవర్ణాల ఇంద్రధనస్సు మీద ఎక్కి కూర్చున్నట్లు, నాకెంతో ఇష్టదైవమైన శ్రీవేంకటేశ్వర స్వామి హఠాత్తుగా సాక్షాత్కరించినట్టు అనిపించి మనసు సంతోషంతో వుక్కిరిబిక్కిరి అయిపోయింది.

ఆపిల్‌పండుని అతని చేతిలో పెడుతూ,

''తిను బాబూ! నువ్వేం చదువుతున్నావు?''

''బికామ్ అయిపోయింది ఆంటీ! ఉద్యోగప్రయత్నంలో వున్నాను.'' అన్నాడు.

''ఏంబాబూ! ఇంత చిన్నివయసులో అప్పుడే ఉద్యోగ ప్రయత్నం మొదలెట్టావేంటి? ఇంజనీరింగు చదవాల్సింది. మంచి భవిష్యత్తు వుండేది.'' అన్నాను సానుభూతిగా.

''మనాన్నగారు లేరండి. నా చిన్నప్పుడే పోయారు. అమ్మ చదువుకోలేదు. ఎలాగో కష్టపడి నన్ను ఈమాత్రమైనా చదివించింది. నేను వెంటనే ఏదన్నా ఉద్యోగం సంపాదించి అమ్మని పోషించాలి కదండీ.''

ప్రసాదరావు పోయాడన్న వార్త విని షాక్ తిన్నాను. దుఃఖం మనసులోంచి తన్నుకొచ్చింది.

''అయ్యో. అదేమిటి? మీ నాన్నగారు అంత త్వరగా పోవడం ఏమిటి?''

నా కన్నీటిని విశ్వప్రయత్నం మీద అణుచుకంటూ అడిగాను.

''ఏమిటోనండీ! ఎప్పుడూ విపరీతంగా సిగరెట్లు కాలుస్తూ ఏదో ఆలోచిస్తూ వుండేవారట. అమ్మని అసలు పట్టించుకునేవారు కాదుట. నాన్నగారు, పెళ్లికి ముందే ఎవరినో ప్రేమించారని ఆమెతో వివాహం జరగకపోయేసరికి పిచ్చివారిలా అయిపోయారని అందరూ చెప్పుకుంటూ వుంటే అమ్మ విందట.''

నాలో అపరాధనాభావం తొంగిచూస్తోంది. ప్రసాదు అలా అయిపోవడానిక్కారణం నేనే అని అభం-శుభం తెలియని ఆ కుర్రాడికి ఎలాచెప్పను! అతని ఫ్రాంక్‌నెస్ నాకు చాలా నచ్చింది.

''ఇంతకీ మానాన్నగారు మీకెలా తెల్సు ఆంటీ?'' ఆశ్చర్యం ప్రకటించాడు జగదీష్.

నేను ఒక్కక్షణం తడబడ్డాను.

''ఆс.. అహ... నాకు తెలీడం.. అంటే మా అన్నయ్య ఫ్రెండ్ ప్రసాదనివుండేవాడు. అతని పోలికలు నీలో కనిపించి అడిగాను. అంతే.'' అబద్ధం ఆడటానికి చాలా ధైర్యం కావాలి.

''నువ్వు.. ఇప్పుడెక్కడికి వెళ్తున్నావు?''

''హైదరాబాదులో ఏదన్నా వుద్యోగం దొరకొచ్చని బయలుదేరాను. నాకు వుద్యోగం దొరికాక అమ్మని తీసుకువచ్చేస్తాను.''

''మీ అమ్మ చాలా అదృష్టవంతురాలు.'' ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా అనేసాను, నా ఆలోచనలు అలా అలా ప్రయాణం చేస్తూ ప్రసాదరావు దగ్గరకి వెళ్లి ఆగాయి.

''ప్రసాద్! ప్రసాద్!'' నా మనసు ఆక్రోశించింది.

***


మేము, ప్రసాదువాళ్లు ఒకే వీధిలో వుండేవాళ్లం. నాకు ప్రసాదంటే పిచ్చిప్రేమ, చెప్పలేనంత ఇష్టం, ఆరాధన, అభిమానం, నా ఆరోప్రాణం కూడా. నేను ప్రసాదుని అంతగా ప్రేమించాను. ప్రసాదు కూడా నన్ను అంతకన్నా ఎక్కువగా ప్రేమించాడు. మాది జన్మ జన్మల బంధం అయివుంటుంది. ప్రసాదు నన్ను చూడకుండా ఒక్కక్షణమైనా వుండలేకపోయేవాడు. నేనూ అంతే. ఎలాగో ఒకలాగ ఇంట్లో అబద్ధాలాడి బయటపడేవాళ్లం. గుళ్లు, గోపురాలు, కాలువ గట్లు, కొబ్బరితోటలు మేం కల్సుకుని క్షణాల్ని కరిగించి గంటలుగా మార్చే స్థలాలు. మా ప్రేమకి కొబ్బరి చెట్లు సాక్ష్యాలు. మేం మాట్లాడుకుంటూ వుంటే కొబ్బరి చెట్లు అందంగా తలలూపేవి. చెట్ల మీద పక్షులు మా మాటలు వింటూ కిలకిలరావాలతో నవ్వేవి. అవన్నీ మా నేస్తాలు!


''ప్రసాద్! వద్దు. దగ్గరకురావద్దు. నీ మీసాలు నాకు గుచ్చుకుంటాయి.'' అన్నా ప్రసాదు వినేవాడు కాదు. అంత దగ్గరగా పురుషస్పర్శ నాలో ఏదో అలజడిని రేకెత్తించేది. ఒడ్డూ పొడవూ, వెడల్పు బాహువులు, చక్కటి క్రాఫింగ్, చిలిపిగా చూసే కళ్లు, విశాలమైన ఛాతీ.. ఓహ్. ప్రసాదు ఖచ్చితంగా ఆధునిక మన్మధుడే! మన్మధుడు కూడా ఇంత బాగుండడేమోమరి! అసలు అంత చక్కటి ప్రసాదుని కన్న అతని తల్లికి పాదాభివందనం చెయ్యాలి. చూస్తూంటే ఇంకా చూడాలనిపించే అతని ముఖం, అతని తేజస్సు, అబ్బ... ప్రసాదుని జీవితాంతం అలా చూస్తూ వుండిపోతే చాలు. నాకింకేమీ అక్కర్లేదు..అనిపించేది.

నా జీవితం ప్రసాదు. నాప్రాణం ప్రసాదు. నా ఊపిరి ప్రసాదు. నా సర్వస్వం ప్రసాదు! ప్రసాదు! ప్రసాద్! ప్రసాద్! ఇరవైనాలుగ్గంటలూ ప్రసాద్ నామ స్మరణే నాకు!

ఒకసారి ప్రసాదు కాలికి దెబ్బ తగిలింది. చిన్న ఫ్రాక్చర్ అయిందని హాస్పిటల్‌కి తీసుకెళ్లి కట్టు కట్టించారు. చూడాలని నా మనసు కొట్టుకుపోయింది. ఎలా వెళ్లను? వెళితే మా ఇంట్లో వాళ్లు ఏమనుకుంటారోనని భయం! నోట్సురాసుకుందికి క్లాసుమేట్ వనజ ఇంటికి వెళ్తానని చెప్పి ప్రసాద్ వున్న హాస్పిటల్‌కి వనజని తీసుకుని వెళ్లాను. నన్ను చూడగానే ప్రసాద్ కళ్లు మెరిసాయి.

''వచ్చావా! సుజాతా!'' అతని గొంతు మార్దవంగా పలికింది. ఆ కళ్లల్లో, ఆ ముఖంలో నన్ను






చూసిన ఆనందం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. నేను సంతోషంతో ఒక్కక్షణం వూపిరి తీసుకోవడం మర్చిపోయాను! ప్రసాద్ నాచేయిపట్టుకున్నాడు. పక్కనే వనజ వుంది. నేను సిగ్గుపడ్డాను. కాని వనజ నా భుజంమీద చేయి వేస్తూ నవ్వి ''నాకు తెలుసు లేవే!'' అంటూ అవతలకి వెళ్లిపోయింది.

అక్కడ ఎవరూ లేరు. నాలో ఏదో భావావేశం!

ప్రసాద్ నా వాడు! కేవలం నావాడు! నా స్వంతం. అన్న భావన కలిగింది. అతని ముఖాన్ని ముద్దుల్తో ముంచెత్తాను. సడన్‌గా పరిసరాలు గుర్తొచ్చి పరుగెత్తినంత వేగంగా అవతలకి వెళ్లిపోయాను. ఆ తీపి అనుభవం చాలు కొన్నాళ్లు తల్చుకుంటూ హాయిగా గడిపెయ్యడానికి అనుకున్నాను. ఇంటికొచ్చాక గుర్తొచ్చింది.

''అయ్యో. అసలు ప్రసాదు ఎలా పడ్డాడు? ఎక్కడ పడ్డాడు? హాస్పిటల్‌లో ఎన్నాళ్లుండాలి?'' అన్న విషయాలు అడగడం మర్చిపోయానని!?

పాపం ప్రసాదు ఏమనుకున్నాడోనని తర్వాత బాధపడ్డాను.

నా ఊహలు చాలా చిత్రంగా వుండేవి..

...ప్రసాద్‌తో పెళ్లి అయింది. రాత్రి శోభనం. శోభనం రోజు రాత్రి నేను సిగ్గుపడుతూ గుమ్మం దగ్గర నించుంటే అతను నన్ను చేయి పట్టుకుని మంచం దాకా తీసుకువెళ్లాడు. నా శరీరంలో విద్యుత్ ప్రకంపనల్లాంటివి వుత్పన్నమయ్యాయి. నేను తమకంతో అతని గుండెల మీద వాలిపోయాను. అతను నన్ను రెండుచేతులతో కౌగిలించుకుంటూ ఉక్కిరిబిక్కిరి చేసాడు. మేమిద్దరం ఆరాత్రంతా స్వర్గసుఖాల్లో తేలాం. ఏడాది తిరిగేసరికి పండంటి బాబు పుట్టాడు. అచ్చం ప్రసాదులాగే చక్కగా..! నా పక్కన పడుకున్న చంటివాడు నాకు బుల్లి ప్రసాద్‌లాగ కనిపించాడు. నాకు ఫక్కున నవ్వొచ్చింది..

''ఎందుకే నవ్వుతున్నావు?'' వనజ వచ్చింది గదిలోకి.

ఊహల్లోంచి బయటపడ్డాను. నా సంగతి దానికి బాగా తెలుసు.

''మీ ఇంట్లోవాళ్లకి చెప్పావా?'' వనజ అడిగింది.

''ఏవిషయం?'' అన్నాను.

''అదేనే. ప్రసాదుతో నీ ప్రేమ వ్యవహారం!'' అంది వనజ నవ్వుతూ.

''నాకెందుకో భయంగా వుందే.'' అన్నాను.

''భయపడితే ప్రేమించకు. ప్రేమిస్తే భయపడకు'' అంది వనజ పెద్ద ఆరిందాలాగ.

తర్వాత ఇంట్లోవాళ్లకి చెప్పాను. ఆరోజు ఇంట్లో పెద్దరాద్ధాంతం చేసారు వాళ్లంతాకల్సి.

''నీకు బుర్రా.. బుద్ధీ వున్నాయా? లేదా? మన అంతస్థు ఏమిటి? వాళ్ల అంతస్థు ఏమిటి? వాడికే ముందని నిన్నువాడికిచ్చి పెళ్లి చేయడానికి! నువ్వు ఇలాంటి పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోకు. ఈ వూర్లో మనకి మంచి పరపతి వుంది. పరువు ప్రతిష్ఠలు వున్నాయి. అవన్నీ నీ మూలంగా పోవడం నేను సహించను.'' అంటూ ఎగిరారు నాన్నగారు.

ఇంట్లో అందరిదీ అదే అభిప్రాయం. నేను ఎక్కడికీ వెళ్లిపోకుండా గట్టి కాపలా పెట్టారు.

అన్ని ప్రేమకథల్లాగే మా ప్రేమకథా ముగిసింది.

అంతస్థుల అడ్డుగోడలు మా ప్రేమని సమాధి చేసాయి.

''ఇప్పుడులాగ... పెద్దవాళ్లని ఎదిరించడం, ప్రాణత్యాగం చేయడం లేచిపోవడం లాంటివి చెయ్యకుండా పరిస్థితులకి తలవంచాను. ఫలితంగా పదిహేనురోజుల వ్యవధిలో ఒక కెమికల్ ఇంజనీరుకి భార్యనయ్యాను.

నా మనసు, నా భావాలు, నా ఆశలు, నా కోరికలు ఎవరికెక్కావాలి? ప్రసాదు జ్ఞాపకాలని నా హృదయ మందిరంలో నిక్షిప్తపరిచాను. ప్రసాదుకి భార్యనై ఒక కొడుకుని కనాలనే పిచ్చికోరిక తీరనే లేదు. నా ఆలోచనల్ని సమాధి చేసుకున్నాను.

***

హైదరాబాదులో మకాం. నా భర్త మంచి వ్యక్తిత్వం వున్న మనిషి. అతను నాపట్ల ఎప్పుడూ కూడా గతం జ్ఞాపకం వచ్చేలా ప్రవర్తించలేదు. నేను కూడా ప్రసాదు జ్ఞాపకాలని నా మనసు మారుమూలల్లో పదిలంగా దాచుకున్నాను, కాని ఏనాడూ బయటపెట్టలేదు. మళ్లీ ఇన్నాళ్లకి జగదీష్...అచ్చం ప్రసాదు పోలికలతో ప్రసాదు కొడుకు! వాడిని నేనే కన్నానేమో అన్న చిత్రమైన భావన కలగసాగింది. జగదీష్ నా కొడుకు! ప్రసాదు కొడుకైతే నాకు కూడా కొడుకే!? ఆ కుర్రాడి మీద విపరీతమైన వాత్సల్యం, ప్రేమ పొంగుకొచ్చాయి.

***

సికిందరాబాదు స్టేషను వచ్చింది.

నన్ను రిసీవ్ చేసుకుందికి మావారు వచ్చారు. నేను జగదీష్‌ని మావారికి సంతోషంగా పరిచయం చేసాను.

''ఈ అబ్బాయికి మీరెలాగైనా ఉద్యోగం యిప్పించాలి.''

''ఒ.కె. అలాగే.'' అన్నారాయన.

''అలాగే అనేసి వూరుకుంటే కాదు మంచి కంపెనీలో మంచి వుద్యోగం ఇప్పించండి.''

''సరే అన్నాను కదా.'' నవ్వారు ఆయన.

''ఇక్కడ పాపం ఆ అబ్బాయికి తెల్సినవాళ్లెవరూ లేరుట. ఉద్యోగం దొరికినదాకా మనింట్లోనే వుంటాడండీ. ప్లీజ్'' అన్నాను అర్థింపుగా.

''సరేలే. నువ్వంతగా చెప్పాలా?!'' మళ్లీ నవ్వుతూ అన్నారాయన.

నాకు జగదీష్‌ని చూస్తూంటే ప్రసాదుని చూసినంత ఆనందంగా వుంది. గతం కళ్లముందు ప్రత్యక్షమై తీయని బాధని కలిగిస్తోంది!

హైదరాబాదు వచ్చిన వారం రోజుల్లోనే మంచి వుద్యోగం దొరికింది జగదీష్‌కి.

జగదీష్ ఆరోజు హాస్పిటల్‌కి వెళ్లిపోతూ ఆగాడు.

''ఆంటీ! ముక్కు మొహం తెలియని మీరు నామీద ఇంత వాత్సల్యం కనబర్చడానికి కారణం తెల్సుకోవచ్చా?'' అడిగాడు జగదీష్. నేను గతుక్కుమన్నాను.

ఒక్కక్షణం అతని కళ్లల్లోకి చూసాను.

''మీ నాన్నగారిని ప్రేమించిన ఆ అభాగ్యురాలిని నేనే బాబూ!'' అన్నాను.

... నీళ్లు నిండిన నా కళ్లకి వెళ్లిపోతున్న జగదీష్ రూపం మసకగా కనిపించింది!!!

★